పావురాల మృత్యుఘోష

- కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో పావురాల మృత్యువాత
- పావురాల వ్యర్థాలతో దుర్వాసన నిండిన స్టేడియం పరిసరాలు
- అనారోగ్యం పాలవుతున్న వాకర్స్
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు



వలలో చిక్కుకొని మరణించిన పావురాలు



మైలార్‌దేవ్‌పల్లి: ఆరోగ్యం కోసం వచ్చే వారికి అనారోగ్యం వెంటాడుతోంది. రోజూ వివిధ ప్రాంతాల నుంచి ఉదయం సుమారు 200 మంది కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకింగ్ చేస్తున్నారు. యోగా, బ్యాడ్మింటన్, చిన్నారులు స్కేటింగ్ చేస్తున్నారు. రూ. 24 కోట్ల వ్యయంతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీ గాలికి వదిలేసింది. దీంతో పావురాలకి అడ్డాగా మారింది. అందులోకి నిత్యం వందల సంఖ్యలో పావురాలు వచ్చి విసర్జన చేస్తున్నాయి. గత సంవత్సరం జీహెచ్ఎంసీ వారు పావురాలు రాకుండా మెష్ (వల) ఏర్పాటు చేశారు. ఆ వలకు చిన్న సందు చేసుకొని పావురాలు లోపలికి దూరిపోయాయి. తిరిగి బయటికొచ్చేందుకు దారి దొరకక పావురాలు అందులోనే ఆకలితో మృత్యువాత పడ్డాయి. దీంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా తయారైంది. వల 30 అడుగులో ఎత్తులో ఉండటంతో దాన్ని వాకర్స్ కూడా తీయలేక పోతున్నారు. ఓ వైపు పావురాల విసర్జితాలు.. మరోవైపు పావురాలు కలేబరాల నుంచి దుర్వాసనతో వాకింగ్ చేసే వారు ముక్కు మూసుకొని వాకింగే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వాకింగ్ చేసే వారు రోగాలబారిన పడుతున్నారని వాకింగ్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

- స్టేడియం నిర్మాణానికి మొదటి నుంచీ అడ్డంకులు ఎదురవుతున్నాయి. దాదాపు ఒకటిన్నర దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో స్టేడియం పూర్తి కాకుండానే అప్పటి ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హడావిడిగా ప్రారంభించారు. అయినా ఎవరికీ ఉపయోగం లేకుండా పోతోంది.
- సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మృత్యువాత పడ్డ పావురాలను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిందిగా కోరుతున్నారు.



కాటేదాన్‌లోని ఇండోర్ స్టేడియం

స్టేడియంలో దుర్వాసన



కొన్ని సంవత్సరాలుగా ఈ స్టేడియంలో వాకింగ్ చేస్తున్నాం. సుమారు వంద మంది ఉదయం నుంచి వారికి అనుకూల సమయాలలో వాకింగ్‌కు వస్తుంటారు. అందరూ పావురాల కళేబరాలు.. వాటి విసర్జితాలతో పరేషాన్ అవుతున్నారు. అధికారులు వెంటనే పావురాలను తొలగించాలని కోరుతున్నా.

– శివాజీరావు, కాటేదాన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆరోగ్యం కోసం వస్తే..



యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని అందరికీ హితువు చెప్పే నాకే చాలా ఇబ్బందికరంగా ఉన్నది. నిత్యం యోగా చేయడానికి వచ్చే వారికి అసౌకర్యంగా ఉటోంది. పావురాల వాటి విసర్జితాలతో వ్యాధులు వస్తుంటాయి. వందల సంఖ్యలో చనిపోతే ఎలాంటి వ్యాధులు వస్తాయో అని ఆందోళన చెందుతున్నాం. వెంటనే పావురాలను తొలగించాలని అధికారులను కోరుతున్నా.

– భద్రయ్య, యోగా గురువు

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడిపై దాడి

- మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడంటూ ఆగ్రహం
- గిరీష్‌తోపాటు కుటుంబ సభ్యులపై దాడి
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- ఐదుగురు మహిళల అరెస్టు



గాయపడిన గిరీష్

రాజేంద్రనగర్: చిత్రగుప్తా యూట్యూబ్ చానల్ యజమాని దారమోని గిరీష్ నివాసంపై మంగళవారం రాత్రి కొందరు మహిళలు దాడి చేశారు. గిరీష్‌తో పాటు అతడి తల్లి, భార్య, స్నేహితుపై దాడికి పాల్పడ్డారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... హైదర్‌గూడ రాధాకృష్ణనగర్‌లోని జీఎస్ఆర్ హార్మోని అపార్ట్‌మెంట్‌లో గిరీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. గిరీష్ చిత్రగుప్తా యూట్యూబ్ చానల్‌ను కొంతకాలంగా నిర్వహిస్తున్నాడు. గతంలో గిరీష్ బీజేపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పని చేశాడు. గత సంవత్సరం నవంబర్‌లో పార్టీ సభ్యత్వం, పదవి నుంచి గిరీష్‌ను పార్టీ తొలగించింది. మాదాపూర్‌లో యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తున్నాడు. చిత్రగుప్తా యూట్యూబ్ చానల్‌లో గిరీష్ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు కొన్ని సినిమా పాటలను జోడిస్తూ హేళన చేస్తున్నాడంటూ మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కొందరు మహిళలు గిరీష్ నివాసానికి చేరుకున్నారు. తలుపు తట్టినా తీయకపోవడంతో బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. గిరీష్‌పై దాడి చేసి చెప్పుల దండ వేసి ఇంటికి నుంచి బయటికి తీసుకొచ్చారు. దీంతో తల్లి వాణిశ్రీ, భార్య షఫాలీ, మరో స్నేహితుడు రామకృష్ణలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని సైతం మహిళలు, కొందరు యువకులు దాడి చేసి గాయపరిచారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గిరీష్‌ను స్టేషన్‌కు తరలించారు. గిరీష్ ఫిర్యాదు మేరకు కాంచన, శోభారెడ్డి, గీతారెడ్డి, పింకీ, పూజలతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు మహిళలను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు. ఇతరుల కోసం గాలిస్తున్నామన్నారు. గిరీష్ ఇచ్చిన ఫిర్యాదుతో పాటు మహిళలను కించపరిచే విధంగా యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేశాడని ఇచ్చిన ఫిర్యాదుతో గిరీష్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాను ఎవరి గురించి ప్రచారం చేయలేదు...

గిరీష్ తన యూట్యూబ్ చానల్‌లో మహిళల గురించి ఎలాంటి అసభ్య ప్రసారాలు చేయలేదని.. ఎవరినీ కించపరిచేలా వ్యవహరించలేదని గిరీష్ వెల్లడించారు. తనతో పాటు తన తల్లి, భార్య, స్నేహితుడు, తనపై దాడి చేయడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఈ విషయంలో వెంటనే స్పందించి దాడి వెనుక ఉన్న పెద్దలను గుర్తించాలని ఆయన కోరారు.

పోలీసులపై దాడి చేసిన యువకుల అరెస్టు

రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన ఐదుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం ... రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబియన్స్ ఫోర్టు చౌరస్తా వద్ద కొందరు యువకులు రోడ్డుపై గొడవ పడుతున్నారని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులను అప్రమత్తం చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవ పడుతున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా వినిపించుకోకుండా పోలీసులపైనే దాడి చేశారు. ఈ విషయాన్ని పోలీసులు స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాజేంద్రనగర్, నౌ నంబర్, హ్యాప్పి హోమ్స్ ప్రాంతాలకు చెందిన ఖాజా అద్నాన్(24), మహ్మద్ ఆర్బాజ్ ఖాన్(19), సయ్యద్ అబ్దుల్(21), ఖాజా ఫయాజుద్దీన్(22), షేక్ హిమాయత్ అలీ(22)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

హెచ్‌సీయూ భూముల వేలం అనైతికం



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలంపై బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించడం చేతకాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుగ్లక్‌లా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏమి మాట్లాడతారో అర్థంకాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఓ వైపు మూసీ సుందరీకరణ అంటూ మరో వైపు హైడ్రాతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని నేడు యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. బాధ్యతలు చేపట్టిన 15 నెలల్లో ఆయన చేసిన ఒక్క మంచి పనిని ప్రజలకు తెలపాలని సవాల్ విసిరారు. పేదలు మరింత నిరుపేదలయ్యారని రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దింపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల స్వాధీనాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జీ చేయడం దారుణమన్నారు. భూ ముల స్వాధీనాన్ని వెంటనే నిలిపి వేసి వాటిని హెచ్‌సీయూకు కేటాయిస్తు జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నామా యాదగిరినేత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి రండి

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాంబాగ్‌లోని సీతారామ మందిరంలో నిర్వహించే రాములోరి కల్యాణానికి హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాటి, ఉపాధ్యక్షుడు మెట్టు వైకుంఠం, కోశాధికారి శ్రీరామ్‌వ్యాస్ సహా విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం కలిసి ఆహ్వానించారు. 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

టీహబ్‌లో స్టార్టప్‌ల ఎంపిక

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) ద్వారా 5వ కోహర్ట్ కార్యక్రమంలో టీహబ్ ఏఐసీ హెల్త్ కేర్ ప్రోగ్రామ్‌లో భాగంగా 209 దరఖాస్తులు రాగా అందులో అత్యుత్తమమైనవిగా 20 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు బుధవారం రాత్రి తెలిపారు. మూడు నెలల హైబ్రిడ్ కార్యక్రమంలో ఎంపికైన స్టార్టప్‌లకు మెంటర్‌షిప్, మార్కెట్ యాక్సెస్, పెట్టుబడిదారులతో అవగాహన, మార్గదర్శకత్వాన్ని అందించనున్నారు.

తాగు నీటి సమస్యలు పరిష్కరించాలి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు

బండ్లగూడ: తాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్.నాగరాజు అన్నారు. తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు నీరు సరిపడా లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కాలనీలలో వారం రోజులకు కూడా వచ్చే పరిస్థితులు లేవన్నారు. నీళ్లు కూడా ఇవ్వలేని దుర్భర పరిస్థితిలో బండ్లగూడ కార్పొరేషన్‌లో ప్రస్తుతం పరిస్థితి ఉందన్నారు. ప్రైవేటు ట్యాంకర్లు కొనలేక సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హిమాయత్‌సాగర్ జలాశయం ఉన్న కూడా సాగర్ నీళ్లు ఇవ్వలేని పరిస్థితి జలమండలి అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. రోజు తప్పి రోజు నీళ్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేసామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నేతలు రావీందర్‌రెడ్డి, రాముయాదవ్, సుధాకర్‌గౌడ్, గంగాని రవి, శాంతినాయక్, వెంకటేష్, రాజ్‌కుమార్, శాంతికుమార్, సయ్యద్ హాజీ, అభిలాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాస్'కు దరఖాస్తుల ఆహ్వానం

మణికొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి నిరుద్యోగులు దరఖాస్తు చేసుకొని సబ్సిడీ రుణాలు పొందాలని మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. సంబంధిత దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. ఆధార్ కార్డు, కులం, ఆధాయం ధ్రువీకరణ పత్రాలు, ఆహార భద్రత కార్డు, వికలాంగులకు వికలాంగుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతలు, ఏదైనా శిక్షణ పొంది ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ వర్గాలు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కౌంటర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సేవా కేంద్రం ఇన్‌చార్జి అధికారి గీత్ ప్రణయ్‌ను ఫోన్: 95533 83653లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



శంకర్‌రాథోడ్, రాజేంద్రనగర్ ఎంఈఓ

అత్తాపూర్: తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఇంటర్మీడియట్‌లో రాణించి విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ సూచించారు. పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముసిగినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునే సయమం ఆసన్నమైందన్నారు. తమ ఆలోచనలకు అనుగుణంగా విద్యావంతులు కుటుంబ సభ్యులతో కలిసి చర్చించుకొని ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా విద్యార్థులు ఎండల్లో తిరగకుండా భవిష్యత్తుకు ఉపయోగపడే ఒకేషనల్ కోర్సులు నేర్చుకోవాలన్నారు. రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో 22 సెంటర్లలో 5004 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4989 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వివిధ కారణాల వల్ల 15 మంది విద్యార్థులు పరీక్షలు రాయలేదన్నారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పూర్తయ్యాయన్నారు. ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



ఎమ్మెల్యే కౌసర్‌తో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు ఈద్ ముబారక్ తెలిపి తమ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఎఫ్‌సీవో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. కోవిడ్ సమయంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్ బాధితులకు విశేషంగా సేవలు అందించారన్నారు. కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ అందించి ఎందరో ప్రాణాలు రక్షించారని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా ఉండాలని ఆయన టీఎఫ్‌సీవో ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్, సమీర్, హబీబ్, అబ్దుల్ బారీ, తౌఫిక్, షహబాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. దర్యాప్తులో కీలకం

- సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసుల చర్యలు
- వ్యాపారులు, ప్రజల సహకారంతోనే సాధ్యం
- నేరాల నియంత్రణలో కీలకపాత్ర
- నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి
- శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి

- హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గత నెల 13న ముగ్గురు వ్యక్తులు ర్యాపిడో ద్వారా ఆటోను బుక్ చేసుకున్నారు.. అక్కడి నుంచి మండల శివారు రాయన్నగూడ వద్దకు చేరుకున్న తర్వాత.. డ్రైవర్‌ను బెదిరించి ఆటోతో ఉడాయించారు.. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లోని ఫుటేజీ ఆధారంగా నిందితులు అత్తాపూర్‌లో ఆటోను నిలిపినట్లు గుర్తించి.. వారం రోజుల్లో కేసును చేధించి నిందితులను కటకటాలకు పంపారు.
- నెల క్రితం బెంగుళూరు జాతీయ రహదారిపై ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను మృతి చెందాడు. ప్రమాదానికి గురైన కారు రంగు తెలుపు అనే ఆధారంతో ముందుకు వెళ్లిన పోలీసులు.. రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఆ వాహనాన్ని గుర్తించారు.
- ఇలా పలు కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారింది. అంతేకాకుండా నేరాల నియంత్రణకు వీటి అవసరాన్ని గుర్తించి.. కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రతి ఇల్లు.. ప్రతి మలుపు.. వీధి వీధికి వీటి ఏర్పాటుపై దృష్టి సారించారు.



తొండుపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడి (ఫైల్)

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వివిధ ప్రాంతాల్లో 490 సీసీ కెమెరాలు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. అయితే ఏళ్ల కిందట పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- నానాజీపూర్, బోటిగూడ, రామంజాపూర్‌తండా, మదన్‌పల్లి, గండిగూడలో సీసీ కెమెరాలు వినియోగంలో లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో జరిగే నేరాలు, ప్రమాదాల కేసుల పురోగతిలో ఇబ్బందులు తప్పడంలేదు.
- కొన్ని సందర్భాల్లో సాధారణ మృతుల కేసుల్లో కొందరు పోలీసుల విచారణ ఎదుర్కోవాల్సి వస్తున్నది. పని ప్రాంతాల్లో కూలీలు, సిబ్బంది ఎవరైనా గుండెపోటు, ఫిట్స్ వంటి రోగాలతో ప్రమాదాలకు గురై మృత్యువాత పడితే.. అసలు కారణం తెలియక యజమానులు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉంటే అక్కడ జరిగే ప్రతి సంఘటన నిక్షిప్తం అవుతుంది. దీంతో కేసు దర్యాప్తులో పోలీసులకు కొంత వరకు సులువు అవుతుంది. ఎక్కడైనా గొడవ జరిగితే.. అందుకు గల కారణాలు, బాధ్యులను సులువుగా గుర్తించే అవకాశం ఉంది.

200 మందికి నోటీసులు...

పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, కీలక ప్రాంతాలను గుర్తించిన పోలీసులు 200 మందికి నోటీసులు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ అందుకు తగు చర్యలు చేపట్టారు.

ఆవశ్యకతను గుర్తించాలి



చిరు వ్యాపారులు మొదలుకొని అన్ని వర్గాల వారు దుకాణాలు, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నేరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఆధారాలు సేకరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సీసీ ఫుటేజీ దోహదపడుతుంది. ప్రార్థన స్థలాలు, విద్యా సంస్థల వద్ద కెమెరాల ఏర్పాటు తప్పనిసరి. ఇందుకు అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగు చర్యలు చేపట్టాం. ఇందుకు దాతల సహకారం చాలా ముఖ్యం.

– కె.నరేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, శంషాబాద్

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం

పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్



సాతంరాయిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేతలు నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయమని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాతంరాయిలోని రేషన్ దుకాణం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్‌తో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు మంచి చేసే పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ సొంతమని ఆయన అన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చందర్‌నాయక్, మల్లేశ్, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఉత్సవాలకు ఆహ్వానం



ఎంపీ ఈటలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

గోల్కొండ: సామాజిక సంస్కర్త, బీసీ బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కార్వాన్ బీసీ ఐక్యవేదిక నాయకులు పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి గుడిమల్కాపూర్‌లో జరగనున్న జ్యోతిరావుపూలే 198వ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. హోదా, ప్రతిష్టను ఆశించకుండా జ్యోతిరావుపూలే చేసిన కృషి ప్రతి ఒక్కరికి తెలుసునని ఈటల రాజేందర్ అన్నారు. ఆయనను కలిసిన వారిలో బీసీ ఐక్యవేదిక నాయకులు కె.అనిల్‌కుమార్, పంబి శ్రీనివాస్, నర్సింగ్, శ్యామ్‌సుందర్, వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సహ కార్యదర్శి ప్రభు పూజారి, కట్ట నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రహసనంగా హైమాస్ట్ లైట్ల నిర్వహణ



షేక్‌పేట్ రోడ్డులో ఒక వైపు దీపాలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

గోల్కొండ: రాత్రి పూట ప్రజలకు వెలుగులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. బల్దియా విద్యుత్ దీపాల విభాగం అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. బస్తీలు, కాలనీల్లోని హైమాస్ట్ లైట్లు, మినీ హైమాస్ట్ లైట్లు ఎప్పుడు వెలుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడుగా ప్రధాన చౌరస్తాలైన రేతిబౌలి, నానల్‌నగర్ బస్టాప్, టోలిచౌకీ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లోని హైమాస్ట్ లైట్లలో చాలా వరకు వెలగడం లేదు. వెలుగుతున్న వాటిలోనూ కొన్ని మాడిపోగా కొన్ని వెలుగు ఇస్తున్నాయి.

యెగ్గే మల్లేశంపై దుష్ప్రచారాలు తగవు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘానికి ఒక్క రోజు కూడా సేవ చేయని కొందరు వ్యక్తులు పనిగట్టుకుని బురద చల్లేందుకు ప్రయత్నించడం బాధాకరమని, కులంపై దుష్ప్రచారాలు మానుకుని కులం అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర కురుమ సంగం మీడియా కమిటీ చైర్మన్ చీర శ్రీకాంత్ కురుమ అన్నారు. బుధవారం రాష్ట్ర కురుమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గే మల్లేశం నాయకత్వంలో 12 ఏళ్లుగా రూ. వేల కోట్ల విలువ చేసే ఆస్తులను కూడబెట్టామని, ప్రతి నెల రూ. 30 లక్షలకు పైగా అద్దె రూపంలో సంఘానికి ఆదాయం చేకూర్చిన యెగ్గే మల్లేశంపై కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతి మండలంలో, జిల్లాల్లో, నియోజకవర్గాల్లో సభ్యత్వం నమోదు పూర్తయిన వెంటనే రాష్ట్ర సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు అరుణ్‌కుమార్, సత్యనారాయణ, కొలుపుల నర్సింహా, కొండల్‌రాజు, సి.రాఘవేందర్, మిరియాల విజయలత, కోటి అనిత, ఎం.విజయలక్ష్మీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కట్ట మల్లేశం పాల్గొన్నారు.